అహ్మదాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో ఎయిర్ ఇండియా విమానం కూలిన ప్రాంత విహంగ వీక్షణం, కొనసాగుతున్న సహాయక చర్యలు, గుమికూడిన స్థానికులు

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన భవనంలో మంటలను ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

అహ్మదాబాద్‌లోని బీజే మెడికల్ హాస్టల్ లోపలి వైపు, పై భాగాన కూరుకుపోయిన ఎయిర్ ఇండియా విమాన శకలాలు. హాస్టల్ సమీపంలో కాలి పడిపోయిన మరో విమాన శకలం

32 సెకండ్ల టెర్రర్

అహ్మదాబాద్ విమానాశ్రయంలోని సీసీటీవీ క్యాప్చర్ చేసిన 32 సెకండ్ల నిడివిగల ఫుటేజ్‌లో ఎయిరిండియా విమానం ఏ విధంగా కూలిపోయిందో కనిపించింది. ల్యాండింగ్ గేర్స్ రన్‌వేను వదిలిపెట్టినప్పటి నుంచి విమానం కూలిపోయే వరకు దీనిలో కనిపించింది. ఇది రన్‌వేపై సక్రమంగానే వేగాన్ని అందుకుంది. అప్పుడు అంతా సజావుగానే ఉన్నట్లు అనిపించింది. టేకాఫ్ అయిన కొద్ది సెకండ్లకే ఆ విమానం ఇబ్బందుల్లో ఉన్నట్లు స్పష్టమైపోయింది.

నింగిలోంచి నిప్పుల వాన!

బీజే మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలిన విమానం.. ప్రమాదంలో ఐదుగురు మృతి.. ఐదుగురు గల్లంతు

బీజే మెడికల్ హాస్టల్ మెస్ హాల్ లోకి చొచ్చుకు వెళ్లి వేలాడుతున్న ఎయిరిండియా విమాన శకలాలు

భోజనం మధ్యలోనే అసువులుబాసిన మెడికోలు

ఘటనాస్థలి అంతటా మృతదేహాలు, హాహాకారాలు

ఎప్పటిలాగే భోజనాల సమయమయ్యిందని ఆ మెడికో విద్యార్థులు ప్లేట్లలో కిచిడీ, చారు, పెరుగు వగైరా పెట్టుకొని టేబుల్స్ మీద కూర్చున్నారు. స్నేహితులతో ముచ్చట్లలో మునిగిపోతూ తినడం ప్రారంభించారు. ఇంతలో పైనుంచి నిప్పులు, రాళ్ల వర్షం కురిసింది. రెప్పపాటులోనే ఐదంతస్తుల హాస్టల్ భవనం కంపించిపోయింది. అప్పటివరకూ తమతో మాట్లాడిన స్నేహితులు విగత జీవులుగా కనిపించారు. ఎక్కడ చూసినా మృతదేహాలు.. క్షతగాత్రుల హాహాకారాలు.. ఇది గురువారం ఎయిరిండియా విమానం కుప్పకూలి పడిపోయిన బీజే మెడికల్ కాలేజీ యూజీ హాస్టల్ దగ్గరి పరిస్థితి.. ఈ దుర్ఘటనలో ఐదుగురు మరణించగా.. ఐదుగురు గల్లంతయ్యారు. 19 మంది గాయపడ్డారు.

భూకంపం వచ్చిందనుకున్నం!

విమాన ప్రమాదంతో ఉలిక్కిపడిన స్థానికులు.. పరిస్థితులపై సాక్షుల వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో టేకాఫ్ అయిన ఎయిరిండియా విమానం మేఘానినగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలోని బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాలపై కుప్పకూలింది. దీంతో భారీయెత్తున మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ అలుముకొన్నది. భవనం పైకప్పు, గోడలు ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో భోజనం చేస్తున్న నలుగురు మెడికో విద్యార్థులు, ఒక డాక్టర్ భార్య మరణించగా, ఇద్దరు విద్యార్థులు, ముగ్గురు డాక్టర్ బంధువులు గల్లంతయ్యారు. 19 మంది గాయపడగా, వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. విమానం కూలిన శబ్దాన్ని వినగానే 'భూకంపం వచ్చిందా?' అని తాము భయపడిపోయామని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం గురించి తెలియగానే 6 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 2 బీఎస్ఎఫ్ యూనిట్లు, పదుల సంఖ్యలో ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. హాస్టల్‌లోని క్షతగాత్రులకు వేగవంతమైన వైద్య చికిత్స అందించడానికి గ్రీన్ కారిడార్‌ను అధికారులు ఏర్పాటు చేశారు.

చిందరవందరగా ఆహారం, ప్లేట్లు

విద్యార్థులు భోజనాలు చేస్తున్న సమయంలో ప్రమాదం జరుగడంతో మెస్‌లో ప్లేట్లు, ఆహారం చిందరవందరగా పడ్డాయి. విమానం తోక భాగం బిల్డింగ్‌లోకి చొచ్చుకుపోయిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. మెడికల్ కాలేజీ హాస్టల్ మెస్‌లోకి తొలుత దూసుకుపోయిన విమానం ఆ తర్వాత సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు ఉండేటువంటి అతుల్యమ్ హాస్టల్‌లోకి కూడా చొచ్చుకుపోయినట్టు ప్రత్యక్ష సాక్షి ఒకరు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలైనట్టు తెలిపారు. కూలిపోవడాని కంటే ముందు విమానం చాలా తక్కువ ఎత్తులో ప్రయాణించినట్టు హరీశ్ షా అనే వ్యక్తి పీటీఐతో అన్నారు.

ప్రమాదానికి కారణం ఇదేనా?

టేకాఫ్‌లో సమస్యలు తలెత్తి విమానం లిఫ్టింగ్‌లో అంతరాయం కలిగిందని, దీంతో కిందనున్న చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు వైమానిక రంగ నిపుణులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పక్షులు ఢీకొట్టిన కారణంగా విమానం తగినంత వేగాన్ని అందుకోలేక కూలిపోయి ఉండొచ్చని కూడా అభిప్రాయపడుతున్నారు. అయితే, దర్యాప్తులోనే అన్ని విషయాలు బయటపడొచ్చని చెప్తున్నారు.

ఎయిర్ ఇండియా ఫ్లైట్ ప్రమాద స్థలిలో చెల్లాచెదురుగా పడి ఉన్న విమాన చక్రం, ప్రమాదం జరిగిన భవనం వద్ద గుమికూడిన స్థానికులు, శకలాల నుంచి వెలువడుతున్న పొగలు

పిడుగులా పేలి..

మొదటిపేజీ తరువాయి...

శకలాలు పడ్డట్టు పేర్కొన్నారు. దీంతో నలుగురు మెడికోలు, వైద్యుడి భార్య మృతిచెందారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు. పలువురు స్థానికులు మృతిచెందారు. విమాన ప్రమాదం నేపథ్యంలో సిటీ సివిల్ దవాఖానకు 265 మృతదేహాలు చేరుకున్నట్లు తమకు సమాచారం అందిందని డిప్యూటీ పోలీస్ కమిషనర్ కనన్ దేశాయ్ మీడియాకు చెప్పారు. అయితే, విమాన ప్రమాద మృతుల సంఖ్యను అధికారికంగా ప్రకటించవలసి ఉంది. విమాన ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అసలేం జరిగిందంటే?

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్‌లోని గాట్విక్‌కు గురువారం మధ్యాహ్నం ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం (ఫ్లైట్ నంబర్ ఏఐ-171) ప్రయాణమైంది. డీజీసీఏ ప్రకటన ప్రకారం.. 242 మందితో కూడిన ఈ విమానం రన్‌వే 23 నుంచి మధ్యాహ్నం 1.39 గంటలకు టేకాఫ్ అయ్యింది. అయితే, టేకాఫ్ అయిన 50 సెకండ్లలో 825 అడుగుల ఎత్తు వరకూ వెళ్లిన విమానం.. ఉన్నట్టుండి 625 అడుగుల ఎత్తుకు దిగిపోయింది. ఈ సమయంలోనే గ్రౌండ్ స్టేషన్ నుంచి సిగ్నల్స్‌ను విమానం కోల్పోయింది. ఈ క్రమంలో పూర్తిగా కిందకు దిగిపోయిన విమానం చెట్టుకు ఢీకొని అనంతరం బీజే మెడికల్ హాస్టల్ భవనంతో పాటు నిర్మాణంలో ఉన్న మరో భవనంపై కూలిపోయినట్టు అధికారులు తెలిపారు. విమానం కూలిపోగానే ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ, మంటలతో భయానకంగా మారిపోయింది. విమానం కూలిన శబ్దాన్ని వినగానే 'భూకంపం వచ్చిందా?' అని తాము భయపడిపోయామని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం గురించి తెలియగానే 6 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 2 బీఎస్ఎఫ్ యూనిట్లు, పదుల సంఖ్యలో ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. విమానంలోని ఇద్దరు పైలట్లు, పది మంది క్యాబిన్ సిబ్బంది సహా మొత్తంగా 241 మంది ప్రయాణికులు కూడా మరణించినట్టు పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు శిశువులు సహా 13 మంది చిన్నారులు కూడా ఉన్నట్టు పేర్కొన్నారు. విమాన శకలాలు పడటంతో 20 మంది కిపైగా మెడికోలు, స్థానికులు మరణించినట్టు సమాచారం. హాస్టల్‌లోని క్షతగాత్రులకు వేగవంతమైన వైద్య చికిత్స అందించడానికి గ్రీన్ కారిడార్‌ను అధికారులు ఏర్పాటు చేశారు.

విమాన దుర్ఘటన.. హెల్ప్‌లైన్ నంబర్లు..

పౌరవిమానయానశాఖ- 011-24610843, 9650391859	ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా 011-24610843, 9650391859, 9974111327
గుజరాత్ ప్రభుత్వం 079-232-51900, 9978405304	యూకే గవర్నమెంట్ 020-7008 5000
ఎయిరిండియా-1800 5691 444	

నిలిపివేత.. పునరుద్ధరణ

విమాన ప్రమాదం నేపథ్యంలో సర్దార్ వల్లభ్‌భాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును మూడు గంటల పాటు తాత్కాలికంగా మూసివేశారు. పలు విమానాలను రద్దు చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత విమానాశ్రయాన్ని తిరిగి తెరిచి విమాన సేవలను పునరుద్ధరించారు.

విమానంలో ఎవరెంతమంది?

విమానంలో మొత్తం ఉన్నవారు 242	పైలట్లు: 2
	క్యాబిన్ సిబ్బంది : 10
	ప్రయాణికులు: 230

ప్రయాణికుల్లో ఏ దేశంవారు ఎంతమంది?

భారతీయులు	బ్రిటిషర్లు
169	53

పోర్చుగీసువారు-7, కెనడీయులు-1

విమాన ప్రమాదంపై కేసీఆర్ దిగ్భ్రాంతి

- మృతులకు నివాళి.. బాధిత కుటుంబాలకు సానుభూతి
- పరిహారమిచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి

హైదరాబాద్ జూన్ 12 (నమస్తే తెలంగాణ): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నివాసాలపై విమానం కూలిపోయిన ఘటనలో ప్రయాణికులు, సామాన్యులు, వైద్య విద్యార్థులు మరణించడంపై ఒక ప్రకటనలో విచారం వ్యక్తంచేశారు. ఆప్తులను కోల్పోయి శోకతప్త హృదయులైన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని, మృతుల కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కేంద్రంతోపాటు గుజరాత్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

- క్షతగాత్రుల వైద్య ఖర్చు భరిస్తాం: టాటా గ్రూప్

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి టాటా గ్రూప్ రూ.కోటి రూపాయల చొప్పున పరిహారం అందజేస్తుందని ఎయిరిండియా, టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఎక్స్‌లో ప్రకటించారు. అలాగే గాయపడిన వారి వైద్యానికి అయ్యే ఖర్చును తమ సంస్థ భరిస్తుందని, వారి భద్రత, సహాయానికి కావాల్సిన పూర్తి సహకారం అందజేస్తామని చెప్పారు. ప్రమాదంలో ధ్వంసమైన బీజే మెడికల్ హాస్టల్ నిర్మాణానికి సహకారం అందిస్తామని, ఈ అనూహ్యమైన సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని ఆయన పేర్కొన్నారు.

బాధితులకు అన్ని విధాలుగా సహాయం

- రామ్మోహన్ నాయుడు

విమాన ప్రమాద బాధితులకు అన్నిరకాలుగా సహాయ, సహకారాలు అందించేందుకు డీజీసీఏ, ఏఏఐ, ఎయిరిండియా, ఎన్‌డీఆర్ఎఫ్, స్థానిక అధికార బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రమాద స్థలాన్ని తాను పరిశీలించానని, అది చాలా బాధ కలిగించిందన్నారు.

విజయ్ రూపానీ దుర్మరణం

ఎయిరిండియా విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి మృతి

లండన్‌లోని భార్యను తీసుకొద్దామని వెళ్తూ తిరిగిరాని లోకాలకు రూపానీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

విమానంలో విజయ్ రూపానీ

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ (68) మృతి చెందారు. ఈ మేరకు కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్ గురువారం వెల్లడించారు. 'లండన్‌లోని కుటుంబ సభ్యులను కలువడానికి వెళ్తుండగా రూపానీ విమాన ప్రమాదంలో మరణించారు' అని పాటిల్ అన్నారు. భార్య అంజలీ రూపానీని తీసుకురావడానికే విజయ్ రూపానీ లండన్‌కు ప్రయాణమయ్యారని 'న్యూస్18'తో రూపానీ కుటుంబసభ్యులు తెలిపారు. రూపానీ మరణవార్త తెలియగానే రాజ్‌కోట్‌లోని ఆయన నివాసం ముందు స్థానికులు పెద్దయెత్తున గుమిగూడారు. ఆయన సేవలను గుర్తు చేసుకొన్నారు.

అలా రెండో వ్యక్తి..

ప్రమాదానికి గురైన ఎయిరిండియా ఫ్లైట్ మ్యానిఫెస్టో ప్రకారం.. 12వ ప్యాసింజర్‌గా రూపానీ ఉన్నారు. బిజినెస్ క్యాటగిరీకి చెందిన జడ్-క్లాస్ టికెట్‌ను ఆయన బుక్ చేసుకొన్నారు. కాగా గుజరాత్ సీఎంగా పనిచేసి విమాన ప్రమాదంలో మరణించిన రెండో సీఎంగా రూపానీ నిలిచారు. 60 ఏండ్ల కిందట 1965లో గుజరాత్ మాజీ సీఎం బలవంత్‌రాయ్ మెహతా కూడా ఇలాగే ఓ విమాన ప్రమాదంలో కన్నుమూశారు.

రెండుసార్లు సీఎం

ఆగస్టు 2016 నుంచి సెప్టెంబర్ 2021 వరకూ గుజరాత్‌కు సీఎంగా రూపానీ రెండుమార్లు పనిచేశారు. అంతకు ముందు వాటర్ సప్లై, కార్మిక, రవాణాశాఖ మంత్రిగా, రాజ్యసభ ఎంపీగా, రాజ్‌కోట్‌కు మేయర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం పంజాబ్ బీజేపీ ఇంచార్జీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రూపానీకి ఒక కుమారుడు రుషబ్, కుమార్తె రాధిక ఉన్నారు. గతంలో ఓ కారు ప్రమాదంలో చిన్న కుమారుడు పూజిత్ మరణించారు. కుమారుడికి గుర్తుగా చారిటీ పనుల కోసం పూజిత్ రూపానీ మెమోరియల్ ట్రస్ట్‌ను రూపానీ ఏర్పాటు చేశారు.

మోదీ, షా రాజీనామా చేయాలి

విమాన దుర్ఘటనపై సుబ్రమణ్యస్వామి

న్యూఢిల్లీ, జూన్ 12: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలంటే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు తమ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని బీజేపీ సీనియర్ నాయకుడు సుబ్రమణ్య స్వామి డిమాండు చేశారు. 1956లో అరియలూరు రైలు ప్రమాదం జరిగిన తర్వాత అప్పటి రైల్వే మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామా చేసిన ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. అదే నైతికతతో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలని ఆయన డిమాండు చేశారు. మోదీ, ఆయన సహచరులు ప్రస్తుతం సాగిస్తున్న తిరుగుళ్లు ఇక వెంటనే కట్టిపెట్టాలని కూడా ఆయన డిమాండు చేశారు.